నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 20 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కేటీఆర్‌కు రాఖీ కట్టిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 19 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి రాఖీ కట్టి తన సోదర భావాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ లోని బీఆర్ఎస్ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మర్యాద పూర్వకంగా కలిసి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. అంతకు ముందు పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆలిబిన్ అహ్మద్‌కు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టి మిఠాయి ఇస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రాస్తారోకో చేస్తున్న నాయకులను పక్కకు తప్పిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు రౌడీయిజంపై చర్యలు తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ రాస్తారోకో

మంచిర్యాల టౌన్, ఆగస్టు 19 : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రౌడీయిజంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచిర్యాలలోని ఓవర్ బ్రిడ్జిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బలవంతంగా పక్కకు తప్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ.. మాజీ ఎంపీపీ, నస్పూర్ మున్సిపాలిటీ 21వ వార్డ్ కౌన్సిలర్ బేర సత్యనారాయణపై అక్రమ కేసు పెట్టించడం వల్ల నిన్న సత్యనారాయణ ఏసీపీ కార్యాలయంలోనే గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడని అన్నారు. ఈ అక్రమ కేసు పెట్టిన నస్పూర్ మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల ఏసీపీపై చర్యలు తీసుకుని, అక్రమ కేసు పెట్టినందుకు వారిద్దరిని వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాలలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల మీద దాడులు చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. పోలీసులు, అధికారులు వారి పద్ధతి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో మరో తెలంగాణ ఉద్యమాన్ని మంచిర్యాల నియోజకవర్గంలో చూస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

బాధితులు, కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

పిచ్చుకపై కాంగ్రెస్ బ్రహ్మాస్త్రం

మంచిర్యాల నియోజకవర్గ కార్యకర్తలతో కాంగ్రెస్ బల ప్రదర్శన

- బాధితులు తొమ్మిది మందే.. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు
- బేర సత్యనారాయణ ఆరోపణలకు బలం చేకూర్చిన రాస్తారోకో

మంచిర్యాల, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడం, మంచిర్యాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలుపొందడంతో నస్పూర్ మున్సిపాలిటీలో కక్ష రాజకీయాలు తెరలేశాయి. నస్పూర్ మున్సిపాలిటీకి చెందిన 21వ వార్డు కౌన్సిలర్ బేర సత్యనారాయణపై ఇటీవల రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విషయంలో ఆయనను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి సీసీసీ పోలీస్ స్టేషన్ పట్టుకొచ్చారు. కేసు విచారణ ఉందని ఏసీపీ కార్యాలయానికి తరలించగా, ఆయన అక్కడే గొంతుకోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఈ ఘటన ఆదివారం జిల్లావ్యాప్తంగా సంచలనం కలిగించింది. బేర సత్యనారాయణ వల్ల మాకు అన్యాయం జరిగిందంటూ సోమవారం నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద పలువురు బాధితులు రాస్తారోకో నిర్వహించారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలిచి సంఘీభావం ప్రకటించారు. పెద్ద ఎత్తున నిర్వహించిన ఈ రాస్తారోకోలో బేర సత్యనారాయణ బాధితులమంటూ అంజయ్య, రొడ్డ రాజేశం, సం దెల శశికుమార్, జాడి శ్రీనివాస్, చింతల రామానుజం, శివరామయ్య, చిలువేరు శ్రీనివాస్, చిలువేరు కిరణ్, తిప్పని భీమయ్య ఉన్నారు. ఈ తొమ్మిది మందికి మద్దతు ఇస్తున్నట్లుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో హాజరైయ్యారు. మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్‌లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడం చర్చనీయంశంగా మారింది. వీరి ఆందోళన వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందంటు పలువురు చర్చించుకుంటున్నారు. బేర సత్యనారాయణ ముందు నుంచి ఎమ్మెల్యే తనను టార్గెట్ చేశారని, అనవసరమైన కేసులు పెట్టించి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ కేసుల సందర్భంగా ఆరోపణలు చేశారు. సీసీసీ కార్నర్ వద్ద జరిగిన బేర సత్యనారాయణ బాధితుల ఆందోళనకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తల తరలింపు చూస్తుంటే ఆయన చేసిన ఆరోపణలకు బలం చేకూర్చినట్లుగా ఉంది. అసలు సమస్య నస్పూర్‌లో ఉంటే నస్పూర్ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై బాధితులకు సంఘీభావమో.. లేక మద్దతు ప్రకటించాలి..కానీ, నియోజకవర్గంలోని కార్యకర్తలను ఇక్కడికి తరలించడం చూస్తుంటే బేర సత్యనారాయణపై కక్ష సాధింపుగానే కేసులు నమోదు చేశారనే దానికి బలం చేకూర్చుతుంది. సత్యనారాయణ బాధితుల ఆందోళన కాంగ్రెస్ చేపించినట్లుగా, కౌన్సిలర్ బేర సత్యనారాయణపై ఎమ్మెల్యే పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ఉపయోగించినట్లుగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

చూసీ చూడనట్లుగా పోలీసులు..!

బీఆర్ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణ బాధితుల ఆందోళన సందర్భంగా పోలీసులు మిన్నకుండిపోయారు. దాదాపు గంట పాటు రోడ్డుపై నినాదాలు చేస్తూ రాస్తారోకో చేశారు. సోమవారం రాఖీ పండుగ కావడంతో ప్రధాన రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. ఉదయం 11గంటల తర్వాత బాధితులతో పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాదాపు గంట పాటు రాస్తారోకో చేశారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రాఖీలో కట్టడానికి బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతరాత్ర వాహనాల్లో వెళ్లాల్సిన వారు ఎక్కడికక్కడే నిలిచిపోయారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో పిల్లలను ఎత్తుకుని నిలబడి నానా ఇబ్బందులు పడ్డారు. తీవ్రమైన ఎండకు తోడు ఉక్కపోతతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆందోళన చేస్తున్న వారిపై తిట్లదండకం మొదలు పెట్టారు. కొంత మంది బస్సు దిగి నడుచుకుంటు వెళ్లిపోయారు. పోలీసులు ఉండి ఎంచేస్తున్నారంటు బస్సులో ఉన్న మహిళలు ప్రశ్నించారు. జనం ఇబ్బందులు పడుతున్న రాస్తారోకో విరమించడంలో పోలీసులు విఫలమైయ్యారు. మంచిర్యాల ఏసీపీ, రూరల్ సీఐ, ఎస్ఐలు అక్కడే ఉండి ఏం చేయలేకపోయారు. ఆందోళన కారులకు నచ్చజెప్పి ట్రాఫిక్ క్లీయర్ చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. డీసీపీ వచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడంతో సమాచారాన్ని డీసీపీ అందజేసిన తర్వాత ఆయన సీసీసీ కార్నర్ వద్దకు చేరుకుని బాధితులు, కాంగ్రెస్ నాయకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన తర్వాత రాస్తారోకో విరమించారు.

నకిలీ కీతో 28లక్షలు చోరీ

- పార్కింగ్ చేసిన కారు నుంచి దొంగతనం
- పాత డ్రైవరే సూత్రధారి, మరో ఇద్దరితో కలిసి ప్లాన్
- నలుగురు నిందితుల అరెస్ట్
- ₹24 లక్షలు స్వాధీనం

బెల్లంపల్లి, ఆగస్టు 19: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి బజార్ మెయిన్ రోడ్‌లో పార్కింగ్ చేసిన కారులో నుంచి ₹28లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు దొరికారు. నకిలీ కీతో డబ్బుల బ్యాగ్‌ను చోరీ చేసి అడ్డంగా దొరికిపోయారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ దేవయ్య ఆధ్వర్యంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, సోమవారం సాయంత్రం రామగుండం కమిషనరేట్ ఆవరణలో సీపీ ఎం శ్రీనివాస్ విలేకరులతో వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న బెల్లంపల్లి బజార్ మెయిన్ రోడ్‌లో ఓ టిఫిన్ సెంటర్‌కు చేరువగా హైదరాబాద్‌కు చెందిన బిపిన్ కుమార్ అనే వ్యాపారి తన మారుతీ కారు పార్క్ చేశాడు. అతను తిరిగి వచ్చేలోపు కారులోని ₹28లక్షల నగదును పలువురు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం వాహన తనిఖీల్లో భాగంగా బెల్లంపల్లి మూలమలుపు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన హైదరాబాద్‌కు చెందిన పటాలవత్ దాసు, జోగు అలియాస్ పోతల శివ, రంగారెడ్డికి చెందిన ముప్పురి రాజు, బెల్లంపల్లి కన్నాల బస్తీకి చెందిన పండుగ రాజును పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.24లక్షల నగదుతోపాటు రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పాత డ్రైవరే సూత్రధారి

వ్యాపారి బిపిన్ కుమార్‌కు గతంలో కారు డ్రైవర్‌గా పటాలవత్ దాసు పనిచేసేవాడు. తన యాజమాని డబ్బుల కలెక్షన్లకు ఎక్కడెక్కడికి వెళ్తాడు? ఎక్కడ బస చేస్తారు? ఎక్కడ టిఫిన్ చేస్తారు? అనే విషయాన్ని తెలుసుకున్న అతను ఆ డబ్బులను కాజేయాలని ప్లాన్ వేశాడు. ఇందులో భాగంగా ఉద్యోగం మానేసే ముందు సదరు కారు కీతో మరో నకిలీ కీని తయారు చేయించాడు. ఈ నెల 16న తన స్నేహితులు జోగు అలియాస్ పోతల శివ, ముప్పురు శివ, పండుగ రాజుతో కలిసి మంచిర్యాలకు వచ్చారు. అనుకున్నట్లే డబ్బుల కలెక్షన్ తర్వాత బెల్లంపల్లిలో టిఫిన్ సెంటర్ వద్ద కారును నిలిపి ఉంచగా నిందితులు వచ్చి నకిలీ కీతో డబ్బుల బ్యాగ్‌ను ఎత్తుకెళ్లినట్లు విచారణలో ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ దేవయ్య, కానిస్టేబుల్ మల్లేశం, సీసీఎస్ కానిస్టేబుల్స్ సతీశ్‌కు సీపీ నగదు రివార్డు అందజేశారు.

నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్

కడుపులోనే పసికందు మృత్యువాత

- పురిటినొప్పులతోనే ఎడ్లబండిపై మూడు కిలోమీటర్లు పయనం
- అంబులెన్స్ ద్వారా దవాఖానకు తీసుకెళ్లే లోపే పసికందు మృత్యువాత

బురదమయమైన మెరగూడ గ్రామం రోడ్డు

కాగజ్‌నగర్, ఆగస్టు 19 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలంలోని మెరగూడ గ్రామానికి చెందిన దుర్గం పోశన్న, దుర్గం పంచపూల దంపతులకు ఒక కూతురు నిహారికా(6), కొడుకు విశాంత్(4) ఉన్నారు. ప్రస్తుతం గర్భంతో ఉన్న పంచపూలకు సోమవారం వేకువ జామున 3 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు రావడంతో దవాఖానకు వెళ్లడానికి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఆ గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో అంబులెన్స్ ఎల్లూర్ గ్రామంలోనే నిలిపివేశారు. మెరగూడ గ్రామం నుంచి ఎల్లూర్ గ్రామానికి రావడానికి సుమారు మూడు కిలో మీటరు రావాల్సి ఉంది. ఆ మూడు కిలోమీటర్లు కూడా మోకాళ్ల లోతు బురదమయంగా ఉండడంతో ఎడ్లబండిపై గంటపాటు శ్రమించి ఎల్లూర్‌లోని అంబులెన్స్ వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి మరో 40 కిలోమీటర్లు ప్రయాణించి కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేస్తామనడంతో అప్పటికే రక్తస్రావంతో ఇబ్బందులు పడుతున్నా గర్భిణీని పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలోని ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి గర్భంలోనే శిశువు మరణించిందని నిర్ధారించి శస్త్ర చికిత్స చేసి మృతశిశువును బయటకు తీశారు. ప్రస్తుతం తల్లి పంచపూల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు స్పష్టం చేశారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న తల్లి పంచపూల

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హాజీపూర్, ఆగస్టు 19 : మండలంలోని పడ్తన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్ శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో పలు అభివృద్ధి పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన సీబీఎస్ పాఠశాల నిర్మాణానికి కోటి రూపాయల విరాళాలాన్ని అందించిన ఎన్నారై అమర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మిట్టపెల్లి తిరుపతి వినతి పత్రం ఇచ్చారు. నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 63లో భూములను కోల్పోతున్న బాధితులు వినతిపత్రం అందజేయగా కనీసం మంత్రి స్పందించ లేదని నిరుత్సాహపడి, మంత్రి కాన్వాయ్‌ని ఆపే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకుని మంత్రి కాన్వాయిని ముందుకు నడిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు.

శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

భారీ వర్షం

పెంచికల్ పేట్, ఆగస్టు 19 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నదమ్ముల ఇంటికి పోయే అక్కా చెల్లెళ్లకు ఈ వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. రెండు గంటలపాటు మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలు మూసివేశారు. అదేవిధంగా మండలం లోని ఎల్లూరు గ్రామంలో ఆదివారం సిడాం శ్రీనివాస్, సోమవారం బాపు రైతుకు చెందిన మేక పిడుగుపాటుకు మృతి చెందింది. వరుసగా రెండు రోజులపాటు ఒకే గ్రామంలో పిడుగు పడడంపై గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మృతి చెందిన ఒక్కొ మేక విలువ రూ.15వేలు ఉంటుందని ప్రభుత్వం, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పిడుగు పడి ఎద్దు మృతి

దహెగాం, ఆగస్టు 19 : మండంలోని ఖర్జీ గ్రామంలో పిడుగు పాటుకు ఎద్దు మృతి చెందగా రైతు అస్వస్థతకు గురైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దన్నూరి అంజన తన పొలం వద్ద ఎడ్లను మేపుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వచ్చిన భారీ వర్షానికి ఎద్దుపై పిడుగు పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా సమీపంలో ఉన్న అంజన్న అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయాడు. కొంత సేపటి తర్వాత స్పృహలోకి అచ్చి సమీపంలో ఉన్న రైతులకు విషయం తెలిపాడు. అంజన్నను వెంటనే గ్రామంలోకి తరలించాచి స్థానికంగా వైద్యం అందించారు. పిడుగు పాటుకు మృతి చెందిన ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలమానేపల్లి, ఆగస్టు 19 : మండలంలోని రవీంద్రనగర్, బాబాపూర్ గ్రామాల్లో సోమవారం 27 క్వింటాళ్ల రేషన్ రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో రవీంద్రనగర్, బాబాపూర్ గ్రామాల్లో తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. రవీంద్రనగర్‌లో ఓ బొలేరోలో 23 క్వింటాళ్లు.., అలాగే బూరెపల్లి నుంచి మహారాష్ట్రకు రెండు బైకులపై తరలిస్తున్న 4 క్వింటాళ్లను బాబాపూర్ వద్ద పట్టుకున్నట్లు వెల్లడించారు. బాలాజీ అనుకోడకు చెందిన రౌతు శంకర్, బూరేపెల్లికి చెందిన నక్కరాని, పెరుగు తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యం, వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

మొక్కనాటి రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు

మొక్కకు రాఖీ కట్టి వృక్షా బంధన్

శ్రీరాంపూర్, ఆగస్టు 19 : శ్రీరాంపూర్‌లోని హిమ్మత్‌నగర్‌లో ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఇంటి ఆవరణలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మొక్కను నాటి మొక్కకు రాఖీ కట్టి వృక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు మమత, మల్లేశ్వరీలు పర్యావరణంపై ఉన్న ప్రేమతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో మొక్కలు నాటి మొక్కకు రాఖీ కట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు వారి సోదరుల పేరిట ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సోదరులపై ప్రేమానురాగాలతో మొక్కను పెంచాలని కోరారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమకు గుర్తుగా మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679